
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 9 డిసెంబరు 2024



మేఘాలలో తేలిపొమ్మన్నది...

- రుషికొండ బీచ్‌లో పారా గ్లైడింగ్
- విజయవంతమైన ట్రయల్ రన్

- వివరాలు మెయిన్ 8లో

బాధితులకు సత్వర బీమా

చెల్లింపు చట్టాలకు సవరణ అవసరం

- హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత
- సీపీ కార్యాలయంలో రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ప్రారంభం



రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ప్రారంభోత్సవంలో హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకాతిరుమలరావు, డీఐజీ గోపీనాథ్‌జెట్టీ, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు, తీవ్రంగా గాయపడిన వారికి సత్వరం బీమా మొత్తం అందాల్సి ఉందని, దీనివల్ల ఆ కుటుంబం కొంతైనా కోలుకునే అవకాశం ఉంటుందని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అభిప్రాయపడ్డారు. పోలీస్ కమిషనరేట్ ఆవరణలో కొత్తగా ఏర్పాటుచేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయకేంద్రాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోజుకు సగటున ఐదు రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే, రాష్ట్ర వ్యాప్తంగా 56 వరకు సంభవిస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాల కారణంగా కమిషనరేట్ పరిధిలో నగటున ప్రతిరోజూ ఒకరు, రాష్ట్రవ్యాప్తంగా 20 నుంచి 25 మంది మృత్యువాతపడుతున్నారన్నారు. మృతులకు సంబంధించిన బీమా పరిహారం కోసం వారి కుటుంబసభ్యులు, క్షతగాత్రులు దరఖాస్తుచేస్తే, వారు అడిగే పత్రాల కోసం పోలీస్‌స్టేషన్, కోర్టులు, బీమా కంపెనీల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. దీనివల్ల బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీమా చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి పరిష్కారంగా సీపీ శంఖబ్రతబాగ్చి రోడ్డు ప్రమాద బాధితులకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేసి టోల్‌ఫ్రీ నంబరు 7995095793ను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారి కుటుంబసభ్యులు బీమా కోసం బాధితుల ... మిగతా 6వ పేజీలో



కొండగుడి ఉత్సవంలో మేరీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న విశ్వాసకులు

వైభవంగా కొండగుడి ఉత్సవం

కొండగుడి అమలోద్భవి మాత ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశ్వాసకులు భారీగా తరలివచ్చి మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. - 6లో

- విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి)

హార్స్ రైడింగ్ ప్రాజెక్టుపై వివాదం

ముడసర్లోవ పార్కులో రూ.6 కోట్లతో నిర్మాణం చేపట్టిన జీవీఎంసీ

- ఈ ఏడాది జనవరిలో ముందస్తు ఆమోదం తెలిపిన మేయర్
- క్యాచ్‌మెంట్ ఏరియాలో నిర్మాణాలపై పర్యావరణవేత్తల ఆందోళన
- నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు
- నాలుగు నెలల కిందట పనులు నిలిపేసిన యంత్రాంగం
- తాజాగా కౌన్సిల్ అనుమతి కోరుతూ అజెండాలో చేర్చిన అధికారులు
- ఈ అంశంలో మేయర్‌ను నిలదీసే యోచనలో కూటమి కార్పొరేటర్లు



ముడసర్లోవ పార్కులో చేపట్టిన హార్స్‌రైడింగ్ ప్రాజెక్టు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ నిర్మిస్తున్న హార్స్ రైడింగ్ ప్రాజెక్టుపై వివాదం ప్రారంభమయింది. రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో హార్స్‌రైడింగ్ పేరుతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారని పర్యావరణవేత్తలు, కూటమికి చెందిన కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో నాలుగు నెలల కిందట ప్రాజెక్టు పనులను నిలిపివేశారు. తాజాగా ... మిగతా 6వ పేజీలో

వర్క్ ఇన్‌స్పెక్టర్ల దందా!

నీటి సరఫరా విభాగంలో హల్‌చల్

- ఉన్నతాధికారులను గుప్పిట్లో పెట్టుకుని చక్రం తిప్పుతున్న వైనం
- టెండర్ తయారీ నుంచి బిల్లు చెల్లింపు వరకూ వారే కీలకం



- అధికారులకు ఇవ్వాలంటూ కాంట్రాక్టర్ల నుంచి భారీగా వసూళ్లు
- ఏళ్ల తరబడి అక్కడే తిష్ట
- ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో కొంతమంది వర్క్ ఇన్‌స్పెక్టర్లపై తీవ్ర స్థాయిలో ఆరోపణలున్నాయి. టెండర్ల నుంచి పని పూర్తయిన తర్వాత బిల్లు తయారీ వరకూ అధికారులు వారిపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా అధికారుల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ముఖ్యమైన ఉప విభాగాల్లో 'నీటి సరఫరా' ఒకటి. కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు, నీటి సరఫరా నెట్‌వర్క్, పంప్‌హౌస్‌ల నిర్వహణ ఈ విభాగం పరిధిలో జరుగుతుంటాయి. జీవీఎంసీ ఖజానాలో నిధులు అందుబాటులో ఉన్నాయా?, లేదా అనే దానితో సంబంధం లేకుండానే నిర్వహణ పనులు, మోటార్లు రిపేర్లు, పైప్‌లైన్ల లీకేజీల పరిష్కారం వంటి వాటికి టెండర్లు పిలుస్తూనే ఉంటారు. ఇందుకోసం చీఫ్ ఇంజనీర్ నియంత్రణలో పనిచేసే సూపరింటెండెంట్ ఇంజనీర్‌తోపాటు ప్రతి జోన్‌కు ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. వీరందరికీ ప్రతి నాలుగైదేళ్లకు బదిలీలు ... మిగతా 6వ పేజీలో

జల్ జీవన్ పనులు రద్దు

జిల్లాలో ప్రారంభంకానివి 113

వీటి విలువ రూ.19.2 కోట్లు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో మూలపడిన జలజీవన్ మిషన్ పనులకు ఇంకా గ్రహణం ఇంకా వీడలేదు. నిధుల కేటాయింపు నిలిచిపోవడంతో ఆ ప్రభావం పనులపై పడింది. దీంతో గతంలో ప్రతిపాదించి, టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. జిల్లాలో ఇలా 113 పనులు ఉండిపోయాయి. సుమారు రెండేళ్ల క్రితం ప్రతిపాదించిన ఈ పనులు రద్దుచేయనున్నారు. దీంతో తాజాగా ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వ ఆమోదానికి పంపేయోచనలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఉన్నారు.



పద్మనాభం మండలం మద్ది గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ట్యాంకు నిర్మాణం (ఫైల్)

జిల్లాలోని నాలుగు మండలాల్లోని 79 గ్రామ పంచాయతీల పరిధిలో 265 గ్రామాల్లో 52,733 ఇళ్లున్నాయి. వీటిలో 1,94,038 మంది జనాభా నివసిస్తున్నారు. నాలుగు సమగ్ర నీటి పథకాలు, 267 సింగిల్ స్కీంలు ఉన్నాయి. అయితే ప్రతి ఇంటికి కొళాయి ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 405 పనులను ప్రతిపాదించారు. వీటిలో 289 పనులకు రూ.61 కోట్లతో ప్రతిపాదించి టెండర్లు పిలిచారు. వీటిలో ఇంతవరకు 152 పనులు పూర్తిచేసి రూ.17 కోట్లు ఖర్చుచేశారు. మిగిలిన 137 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే టెండర్లు పిలిచినప్పటి నుంచి జలజీవన్ మిషన్ పథకానికి నిధులు సమస్య వెంటాడుతూనే ఉంది. గత ఏడాదిలో కొంత వరకు బిల్లులు ఇచ్చిన ప్రభుత్వం, ఈ ఏడాది జనవరిలో మరికొంత మొత్తం విడుదలచేసింది. తరువాత బిల్లులకు ఇబ్బంది రావడంతో కాంట్రాక్టర్లు పనులు ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి అందుబాటులో ఇసుక

భీమిలి, ముడసర్లోవలో స్టాక్ పాయింట్లు

- టన్ను ధర రూ.700

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమిలి, ముడసర్లోవ, గాజువాకలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఇసుక స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. భీమిలి, ముడసర్లోవ స్టాక్ పాయింట్లలో సోమవారం నుంచి టన్ను రూ.700 చొప్పున విక్రయాలు జరుగుతాయన్నారు. భీమిలి స్టాకు పాయింట్ ఇన్‌చార్జి 93980 02019, 7989715157, ముడసర్లోవ పాయింట్‌లో 8309186417, 6300805838 నంబర్లకు వినియోగదారులు ఫోన్‌చేయవచ్చునన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక కావాల్సిన వారు sand.ap.gov.inలో వివరాలు నమోదుచేసి , రిజిస్ట్రేషన్ కాపీ, ఆధార్‌కార్డుతో స్టాక్ పాయింట్‌కు వెళ్తే రిజిస్టర్ చేస్తారని, డిజిటల్ చెల్లింపులతో ఇసుక పొందవచ్చునన్నారు.

నేడు హౌస్ కమిటీ రాక

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు నియమించిన హౌస్‌కమిటీ సోమవారం అక్కిరెడ్డిపాలెంలోని డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనుంది. హౌస్ కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ, సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకేవీ రంగారావు, దాట్ల సుబ్బరాజు సోమవారం ఉదయం నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకుని, అక్కడి నుంచి డెయిరీకి వెళ్తారు. డెయిరీ అధికారులతో మాట్లాడిన అనంతరం, రికార్డులు తనిఖీ చేస్తారు. రైతులు, కార్మికుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. విశాఖ డెయిరీ మొత్తం ఆడారి తులసీరావు కుటుంబసభ్యుల గుప్పిట్లో ఉండడంతో పాటు భారీగా అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో హౌస్‌కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

ఆస్తమాతో ఉక్కిరిబిక్కిరి

చలి, శీతల గాలులతో పెరుగుతున్న కేసులు



- ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రికి ప్రతిరోజూ 60 మందికిపైగా బాధితులు
- ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- చిన్నారులను మెలిపెడుతున్న సమస్య

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

గత కొద్దిరోజులుగా వాతావరణం పూర్తిగా మారింది. రాత్రి, ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. ఉదయం వేళ అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా నగర శివారుల్లో మంచు కురుస్తోంది. దీంతో ఆస్తమా కేసులు పెరుగుతున్నాయి. ఈ సమస్యతో బాధపడుతూ ఆస్పత్రులకు వస్తున్న రోగులసంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. పెదవాల్తేరులోని ఛాతి, అంటువ్యాధులు ఆస్పత్రికి ప్రతిరోజూ ఆస్తమా లక్షణాలతో సాధారణ రోజుల్లో 20 నుంచి 30 మంది మాత్రమే వస్తే.. చల్లని గాలుల ప్రభావంతో ఈ సంఖ్య రెట్టింపయిందంటున్నారు. నగర పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్యా గణనీయంగా పెరుగుతోందని చెబుతున్నారు.

చిన్నపిల్లల్లో అధికం

చిన్న పిల్లల వైద్యులు, పల్మనాలజిస్టులు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు ప్రతిరోజూ కనీసం పది నుంచి 20 వరకు ఆస్తమా లక్షణాలతో రోగులు వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఆస్తమాతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య గడిచిన రెండు వారాలుగా క్రమంగా పెరుగుతోందంటున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఆస్తమాకు కారణమిదే..

శీతాకాలంలో వ్యాప్తి చెందే కొన్ని రకాల వైరస్‌ల వల్ల ఆస్తమా కేసులు పెరుగుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. శ్వాసనాళంలోని గొట్టాలు ముడుచుకుపోయి గాలి లోపలకి వెళ్లనీయకుండా, బయటకు పోకుండా అడ్డుపడతాయని, దీనివల్ల ఆయాసం వస్తుందని, అనంతరం ఆస్తమాకు దారితీస్తుందని చెబుతున్నారు. జలుబుతో పాటు ఉదయం రాత్రి వేళల్లో ఎక్కువ దగ్గుతో ప్రారంభమవుతుందని, కొందరిలో వంశపారపర్యంగా వస్తుందని చెబుతున్నారు. ఈ సమస్యకు ప్రధానంగా దుమ్ము, చల్లదనం, పుప్పొడి, ఉన్ని, జూలుతో కూడిన పెంపుడు జంతువులు, వైరస్‌లు, బాక్టీరియాలు, వాయు కాలుష్యం కారణాలుగా పేర్కొన్నారు.

ఇవీ లక్షణాలు..

ఆస్తమా బారినపడిన పెద్దల్లో అయితే ఊపిరి ఆడకపోవడం, ఆయాసం వంటి ఇబ్బందులుంటాయి. చిన్నారుల్లో పిల్లి కూతలు, డొక్కలు ఎగరేయడం, దగ్గు, జ్వరం, ఏడాదిలోపు పిల్లల్లో శరీరం నీలంగా మారిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని, మూడు ... మిగతా 6వ పేజీలో



ప్రథమ స్థానంలో నిలిచిన కేఎస్‌ఆర్టీసీ క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు

ముగిసిన ఆర్టీసీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు

పోలీస్ పరేడ్ మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్టీసీ జాతీయ స్థాయీ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌గా కర్ణాటక ఆర్టీసీ నిలవగా, రెండోస్థానాన్ని ఏపీఎస్ ఆర్టీసీతో పాటు, బెంగళూరు మెట్రో ట్రాన్స్‌పోర్టు క్రీడాకారులు పంచుకున్నారు. విజేతలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు, విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర తదితరులు బహుమతులు అందజేశారు. - వివరాలు మెయిన్ 3లో

21 అంశాలతో అనుబంధ అజెండా

సిద్ధం చేసిన అధికారులు

- 11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి 21 అంశాలతో అనుబంధ అజెండాను అధికారులు సిద్ధం చేశారు. ఈ మేరకు అజెండా కాపీలను శనివారం కార్పొరేటర్లకు అందజేశారు. కౌన్సిల్ సమావేశానికి ఇప్పటికే 40 అంశాలతో ప్రధాన అజెండా తయారుచేసిన అధికారులు తాజాగా అనుబంధ అజెండా పేరుతో 21 అంశాలను చేర్చారు. తాటిచెట్లపాలేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమకు చెందిన 84 సెంట్ల భూమిని కలెక్టర్ ద్వారా గృహనిర్మాణ సంస్థకు బదిలీ చేశారు. దీనికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ పెండింగ్‌లో ఉండిపోయింది. భూమి ఇచ్చిన వారు ఎస్సీ కమిషన్‌ను కలిస్తే, వారికి ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలని ఆదేశించినందున ముడసర్లోవలో 1.54 ఎకరాల భూమిని కేటాయించేలా కౌన్సిల్ అనుమతి కోరుతూ అనుబంధ అజెండాలో పొందుపరిచారు. అయితే కేవలం మౌఖిక ఆదేశాల మేరకు అత్యంత విలువైన భూమిని కేటాయించేందుకు అధికారులు సిద్ధపడడం, దీనిపై మేయర్, కార్పొరేటర్లకు కనీస సమాచారం లేదని చెబుతుండడంతో సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాలి. కాగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే 655 క్లాప్ వాహనాల్లో చెత్త లోడింగ్ చేసేందుకు 655 మంది కార్మికులను రోజుకు రూ.450 చొప్పున సరఫరా చేసేందుకు తొమ్మిదినెలల కిందట జీవీఎంసీ అధికారులు టెండర్ పిలిచారు. 65 రోజులకు కార్మికులను సరఫరా చేయడానికి మాత్రమే కౌన్సిల్ ఆమోదించగా, ఇప్పటికీ కొనసాగుతున్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా పనిచేసిన కాలానికి వేతనాలు చెల్లించే అంశాన్ని అజెండాలో చేర్చారు. ఈ అంశాన్ని గత కౌన్సిల్ సమావేశం అజెండాలో చేర్చకుండా ఇప్పుడు చేర్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే 24వార్డు పరిధి నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపాన్ని కూల్చివేసి కూల్చేసి ఆ స్థలంలో కొత్తగా రూ.1.99 కోట్ల వ్యయంతో కొత్త కల్యాణ మండప నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని కూడా అనుబంధ అజెండాలో చేర్చారు.

16న మహా సన్నిధాన పూజ

భీమునిపట్నం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్‌లో ఉన్న అయ్యప్పస్వామి ధ్యాన మందిరంలో ఈనెల 16న మహా సన్నిధాన పూజ నిర్వహించనున్నట్టు శ్రీవీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నరసింగరావు తెలిపారు. ఆదివారం వారు స్వామివారి సన్నిధిలో సన్నిధాన పూజకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ముఖ్య సలహాదారు గుగ్గిళ్ళ సాయి పార్వతీశం, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, సహాయ కార్యదర్శి కోండ్రు గోవిందు, కార్యనిర్వాహక కార్యదర్శి దూడి మహేశ్, పీఠం గురుస్వామి వేణుస్వామి, గేదెల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మధురవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం సింహాచలం ప్రాంతానికి చెందిన సరస్వతీ నృత్య కళా మందిరం కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. మూషిక వాహన కీర్తనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గిరిధర గోపాల, బ్రహ్మ కడిగిన పాదము, అదిఉ...అల్లదిఉ.., ముద్దు గారే యశోద, వేణుగానం, తదితర కీర్తనలకు కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. బాల సరస్వతి నృత్య దర్శకత్వంలో భువన, హిరణ్య, ఊర్మిళ, భవిష్య, హర్షిణి నృత్యం చేశారు.

ఉపాధ్యాయుడు మోహన్‌కు జీవిత సాఫల్య పురస్కారం

తగరపువలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొండపేటకు చెందిన జీవీఎంసీ ఆంగ్ల ఉపాధ్యాయుడు డా. గంటాన మోహన్‌రావు విద్యార్థుల ఇంగ్లీషు భాషాభివృద్ధి కోసం రాసిన పుస్తకాలకు గాను జీవిత సాఫల్య పురస్కారం లభించింది. నగరంలోని నోవాటెల్‌లో ది సీ కనెక్టివ్ సంస్థ గ్రేట్ స్టోరీస్ సమ్మిట్ అవార్డుల ఈవెంట్‌లో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.మోహన్‌రావు తగరపువలసలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో విద్యార్థులకు నిరంతరం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తుంటారు. శిక్షణా శిబిరాలతో పాటు వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...మధురవాడలోని లోటస్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 88 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సందర్శకుల సందడి



రుషికొండ బీచ్ పర్యాటకులు

భీమునిపట్నం/సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సాగర తీరం సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. కార్తీక మాసం ముగిసినప్పటికీ ఈ వారం కూడా పలు ప్రాంతాల నుంచి పిక్నిక్‌కు తరలివచ్చారు. భీమిలి కొబ్బరితోట పార్క్, తొట్లకొండ, రుషికొండ ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి. సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు.

వైభవంగా కొండగుడి ఉత్సవం

- మేరీమాత దర్శనానికి పోటెత్తిన భక్తులు
- శనివారం రాత్రి నుంచే రాక
- కిటకిటలాడిన రహదారులు
- 200 మందితో పోలీసుల బందోబస్తు



కొండగుడి ఉత్సవానికి తరలివచ్చిన విశ్వాసకులు (ఇన్‌సెట్లో) మేరీమాత విగ్రహం

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత పోస్టాఫీసు సమీపంలో ఉన్న రోజ్‌హిల్ అమలోద్భవి మాత (కొండగుడి) ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. ఎటుచూసినా ఉత్సవ సందడి కనిపించింది. భక్తులు కొండకు చేరుకుని మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి నుంచే కొందరు కొండగుడికి చేరుకోవడంతో వీధు లన్నీ కిటకిటలాడాయి. పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనల అనంతరం తెల్లవారుజామున నాలుగు గంటలకు భక్తులను కొండపైకి అనుమతించారు. ఐదు గంటల నుంచి ఆలయంలో తెలుగు, ఇంగ్లీష్‌లో దివ్య పూజ బలులు నిర్వహించారు. 7. 30 నిమిషాలకు గుహ వద్ద నల్గొండ పీఠాధిపతుల ఆధ్వర్యంలో తెలుగులో పొంటిఫికల్ దివ్య పూజా బలి జరిపారు. సాయంత్రం 6 గంటల వరకూ దివ్య పూజలు జరిగాయి. మధ్యాహ్నం కొండదిగువన ఉన్న సెయింట్ ఆలోషియస్ స్కూల్ ఆవరణలో పరిశుద్ధ జపమాల చేసి స్కూల్ నుంచి కొండగుడికి విశాఖపురి మేరీమాత తేరుతో భక్తి ప్రపత్తులతో విశ్వాసకులు ప్రదక్షిణ చేశారు. అనంతరం గుహ వద్ద దివ్య సత్ప్రసాద ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేం ద్రవరానికి చెందిన విచారణకర్త రెవరెండ్ ఫాదర్ ఈగల రవీంద్రకుమార్, విశాఖ ప్రొవెన్షియల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ పి. చిన్నప్పరెడ్డి, కొండగుడి డైరెక్టర్ డోలా వేలాంగిణిరావు, ఫాదర్లు థామస్ పుల్లాట్, కొండాల జోసెఫ్, తంబిరాజు, బ్రదర్ మైఖేల్ ఒలికల్, బ్రదర్ బాలరాజ్ తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి, ఉత్సవ ప్రాధాన్యతపై భక్తులకు వివరించారు. కాగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపారు. కొండ దిగువన ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్త రోడ్డు, చిలకల కూడలి వరకు మాత్రమే ఆటోలను అనుమతించారు. భక్తులు కాలినడకన కొండకు చేరుకునేందుకు రోడ్డు పక్కనున్న ఆక్రమణలను తొలగించారు.



పరదేశిపాలెం, మధురవాడకు చెందిన అంధులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

'స్నిగ్ధశ్రీదేవి' సేవలు అభినందనీయం : గంటా

భీమునిపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి చిన్నబజారులో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన 8వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. కలిగొట్ల సంస్థ సేవలను చాలా మంది వద్ద వింటున్నానన్నారు. సంస్థ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి రోడ్డు ప్రమాదంలో తన భార్య, కుమార్తెను కోల్పోయి, వారి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించాల్సిన విషయమన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. సేవలను విశాఖ, విజయనగరం జిల్లాలకే పరిమితం చేయకుండా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాలకు విస్తరించాలని సూచించారు. అనంతరం ఆయన తాళ్లవలస అనాథ బాలలకు, పరదేశిపాలెం, మధురవాడ ప్రాంత అంధులకు, నిరుపేద మహిళలకు దుస్తులు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అలాగే 15 మంది నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు గరికిన కింగ్, బీఎస్‌ఎఫ్ రిటైర్డ్ కమాండెంట్ మూర్తి, ఆర్ఆర్ ఇంజనీరింగ్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు, విజయ్, ఫౌండేషన్ సభ్యులు భానోజీరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సతివాడ' కుటుంబానికి నేతల పరామర్శ

సింహాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, 98వ వార్డు మాజీ అధ్యక్షుడు సతివాడ శంకరరావు అంత్యక్రియలకు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. పెందుర్తి, పశ్చిమ, మాడుగుల ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, గణబాబు, బండారు సత్యనారాయణమూర్తితో పాటు పెందుర్తి ఎంపీపీ రెడ్డి నారాయణరావు, కార్పొరేటర్లు నరసింహం, సేనాపతి శంకరరావు, బల్ల శ్రీనివాసరావు, తదితరులు సతివాడ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాతీయ కరాటే పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ పోర్టు స్టేడియంలో ఈనెల 15 నుంచి నిర్వహించనున్న జాతీయ కరాటే పోటీల ట్రోఫీని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వడోకాయ్ కరాటే డొ అసోసియేషన్, డ్రాగన్ ఫోర్సు మార్షల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

భక్తులతో సింహగిరి కిటకిట

సింహాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో సింహ గిరి ఆదివారం కిటకిటలాడింది. శనివారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. నూతన వధూవరులతో పాటు వారి బంధువులు, సాధారణ భక్తులు స్వామివారి దర్శనానికి తరలిరావడంతో రద్దీ ఏర్పడింది.

బీచ్ రోడ్డులో బైక్ దగ్ధం



భీమునిపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్ ఎర్రమట్టిదిబ్బల సమీపంలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన బైక్ దగ్ధమై ఉంది. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి బైక్‌పై భీమిలి చెందిన యువతీ యువకుడు శనివారం రాత్రి వస్తుండగా మార్లిన్ కే వద్ద యువతి కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో యువకుడు బైక్ నిలిపివేసి, బీచ్‌లోకి పరుగు తీశాడు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వారు బైక్‌కు నిప్పు పెట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతులకు సత్కారం

సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు మునసయ్యపాలెంలో శ్రీకృష్ణ సాయి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆపద్బాంధువు సంఘ మిత్ర కమిటీ సభ్యులు వృద్ధ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. 33 మంది వయో వృద్ధులను గుర్తించి వారికి స్వెట్టర్లు, శాలువాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన నేత శాఖరి శ్రీనివాస్, కోన రాజేశ్, కోన చిన్నారావు, కోన గోపి, పంచదార్ల గోపి, పంచదార్ల వెంకటరమణ, లొడగల రాంబాబు, సారిపల్లి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



గోశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

గంభీరంలో గోశాల ప్రారంభం

ఆనందపురం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూమెంట్ వైకుంఠం ఆధ్వర్యంలో శ్రీవారి గోశాలను ఆదివారం ప్రారంభించారు. అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమం సంకీర్తన మేళాలో భాగంగా ఈ గోశాలను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస మాట్లాడుతూ గోసంరక్షణను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా స్వీకరించాల న్నారు. అనంతరం హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకుడు శ్రీభక్తి వేదాంతస్వామి ప్రభు పాదులు, గోమాత విశిష్టతను తెలుపుతూ గో సంరక్షణపై చేపట్టిన వివిధ కార్యక్రమాలను భక్తులకు వివరించారు. అనంతరం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలకు ఊరేగించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 4 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

సింహాచలం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ఆటోనగర్‌కు చెందిన ప్రబల కుటుంబీకులు నాలుగు లక్షల రూపాయల విరాళం సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో ప్రబల వెంకట భాస్కర సుబ్బారావు, వెంకట శేష ఆదిత్య కౌశిక్, వెంకట సుబ్బలక్ష్మీ, మంగిపూడి ఉష, తదితరులు దేవస్థానం పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్) కు ఆదివారం అందజేశారు. దాతలకు ఆలయ ఆచారం ప్రకారం అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఆస్తమాతో ఉక్కిరిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

రోజులకు మించి దగ్గు, ఆయాసం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. రెండు వారాలుగా కేసులు రెట్టింపు అయ్యాయని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయని ఆయన వెల్లడించారు. అలర్జీ వల్ల ఆస్తమా కేసులు పెరుగుతాయని, ఈ సీజన్‌లో గాలి తీసుకునే మార్గాలు డ్రై కావడంతో దుమ్ము, ధూళి కణాలు లోపలకు వెళ్లి ఆస్తమా బారినపడేలా చేస్తాయని కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. గతంలో పోలిస్తే ఆస్తమా పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. గాలి తీసుకునే మార్గాల్లోని మజిల్స్ కుచించుకుపోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ బంగారు సంపెంగలతో పూజ చేశారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల దందా!

... 5వ పేజీ తరువాయి

జరుగుతుంటాయి. అయితే ఈ విభాగం ఉండే టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లు దాదాపు పదేళ్లుగా అక్కడే తిష్ఠ వేశారు. అందులో ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు. కానీ వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేయిస్తుండడం విశేషం. వర్క్ ఇన్‌స్పెక్టర్లు వార్డుల్లో ఉంటూ ఇంజనీరింగ్ పనులు పర్యవేక్షించడం, పూర్తైన పనులకు కొలతలు, ఎం బుక్‌లో రికార్డు చేయడంలో ఏఈలకు సహకరించాలి. కానీ దానికి విరుద్ధంగా వర్క్ ఇన్‌స్పెక్టర్లను కంప్యూటర్ ఆపరేటర్ల పనికి నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వారిదే రాజ్యం

టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ముగ్గురే విభాగాన్ని శాసిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఏదైనా పనికి అధికారులు అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారుల ఆమోదం తర్వాత టెండర్లు పిలుస్తారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లే టెండర్లను తయారుచేసి సంబంధిత జోన్ డ్రాయింగ్ బ్రాంచీలకు (డీబీ) పంపిస్తారు. ఆ సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లను పిలిచి టెండర్ ఎంత లెస్‌కు వేయాలో సూచించి, వారికే వచ్చేలా చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఆయా పనులు పూర్తయిన తర్వాత ఎంబుక్ ప్రకారం బిల్లు తయారుచేసి డీబీలకు పంపినప్పుడు కూడా ఏంచేయాలనే దానిపై వారే ఉన్నతాధికారులకు సలహాలు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల పేరుతో కాంట్రాక్టర్ల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీరితోపాటు జోన్-8 నీటి సరఫరా విభాగంలో ఇద్దరు అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు చక్రం తిప్పుతున్నారని, అక్కడ పనిచేస్తే వారిద్దరినీ ప్రసన్నం చేసుకోవాల్సిందేనని, లేదంటే బిల్లుల కోసం ముప్పుతిప్పలు పెడతారని గగ్గోలు పెడుతున్నారు. వీటన్నింటిపైనా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీనిని బట్టి వారి అండదండలున్నాయని తేలిందన్నారు. దీంతో చేసేదిలేక కంప్యూటర్ ఆపరేటర్లు చెప్పినట్టుగానే చేసుకుంటూ పోతున్నామని కాంట్రాక్టర్లు నిట్టూరుస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ఆనందపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేములవలస ఎస్సీ కాలనీలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా దళిత సంఘాలు శుక్రవారం పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అదే రోజు కొంతమంది పూలమాలలను తొలగించారు. దీన్ని నిరసిస్తూ దళిత నాయకులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూలమాలలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బాగం గోపాలరావు, ఉప్పాడ అప్పారావు, సియ్యాద్రి రాంబాబు, బి. సన్నిబాబు, మల్లారపు కృష్ణ, ఉప్పాడ సత్యనారాయణ, మామిడి శివ, బోని హరిబాబు, పైల క్రాంతి, ఉప్పాడ రాజు, పాల్గొన్నారు.



ఒడిశా యువకుల నృత్య ప్రదర్శన

ఉత్సాహంగా గిరిజన జాతీయ సమ్మేళనం

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం ఆసుపత్రి ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు జాతి నిర్మాణంలో ఆదివాసీల దేశ భక్తి అన్న అంశంపై డిబేట్ పోటీ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్‌వీకే అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వీకే శ్రీకాకుళం జిల్లా అధికారి కె. వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ, అల్లం రామ్ ప్రసాద్, ప్రసన్న శ్వేత, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస జూట్‌మిల్లు పింఛన్‌దారుల సమావేశం

తగరపువలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చిట్టివలస జూట్ మిల్లు పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు చిట్టివలస కార్మిక భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు మాట్లాడుతూ కార్మికులు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి కనీస పింఛన్ రూ. 5 వేలుగా నిర్ణయించాలని కోరారు. కార్మిక శాఖ సమావేశాలు నిరంతరం జరుగుతున్నా.. పింఛన్ సమస్యలను మాత్రం ప్రస్తావించడం లేదని చెప్పారు. దీన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఈనెల 17న పింఛనుదారుల బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా దామోదర బావాజీ, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మోర అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా అప్పా రావు ఎన్నికయ్యారు. వారితో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా, 12 మందిని సమితి నిర్వహణ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముగిసిన సౌత్ జోన్ చెస్ పోటీలు



విజేతలతో గీతం వర్సిటీ ఆచార్యులు

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో నాలుగు రోజులుగా ఏఐయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల చెస్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. మద్రాస్ యూనివర్సిటీ జట్టు ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు నిలిచింది.ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కేరళ విశ్వవిద్యాలయం 4వ స్థానంలో నిలిచాయి. విజేతలకు గీతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. గ్రాండ్ మాస్టర్ వైశాలి రమేశ్‌బాబును గీతం విశ్వవిద్యాలయం తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హార్స్‌రైడింగ్ ప్రాజెక్టుపై వివాదం

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టు పూర్తి చేసేందుకు వీలుగా మేయర్ ఇచ్చిన ముందస్తు ఆమోదాన్ని ర్యాటిఫై చేయాలంటూ ఈనెల 11న జరగనున్న కౌన్సిల్ సమావేశం ఎజెండాలో చేర్చడం చర్చనీయాంశమైంది. దీనిని అడ్డుకునేందుకు కొందరు కార్పొరేటర్లు సమాయత్తమవుతున్నారు. నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 1901లో ముడసర్లోవ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇది 80 ఎకరాల్లో విస్తరించింది. సుమారు 4,216 ఎకరాల పరీవాహక ప్రాంతం ఉంది. రిజర్వాయర్‌ను ఆనుకుని 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కులో అనేక చెట్లున్నాయి. పార్కుకు ఒకవైపు రిజర్వాయర్, మరోవైపు అడవి ఉండడంతో పక్షుల ఆవాసానికి అనుకూలం. పార్కులో సుమారు 105 రకాల జాతుల పక్షు లు, ఇతర జీవులు ఉన్నట్లు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ గత కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సుమారు రూ.ఆరు కోట్ల వ్యయంతో గుర్రపుస్వారీ పార్కుని నిర్మించాలని నిర్ణయించారు. గుర్రాలను ఉంచేందుకు షెడ్లు, ఆలనాపాలనా చూసే సిబ్బందికి నివాసాలు, స్వారీ కోసం ట్రాక్ కోసం పార్కులో నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్‌తో భారీ నిర్మాణాలు చేపట్టడంపై పర్యావరణ వేత్తలు అభ్యంతరం తెలిపారు. పైగా ఆ ప్రాంతంలో యంత్రాలను ఉపయోగించి పురాతన చెట్లను తొలగించేస్తున్నారని, దీనివల్ల జీవ సమౌతాల్యానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రాజెక్టును తక్షణంనిలిపేయడం ద్వారా 105 రకాల జీవజాతులను పరిరక్షించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశారు. దీంతో జీవీఎంసీ అధికారులు నాలుగు నెలల కిందటే ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును మరొకచోటకు తరలిస్తారనే ఊహాగానాలు వినిపించాయి. ఇంతలో ఈనెల 11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్ హరివెంకటకుమారి నిర్ణయించారు. ఈ మేరకు అజెండాలో చేర్చారు. గుర్రాలస్వారీ ప్రాజెక్టుకు జీవీఎంసీకి చెందిన ఏకైక తాగునీటి రిజర్వాయర్ మనుగడతోపాటు పార్కులో జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే ప్రాజెక్టును నిలిపేస్తున్నట్టు తప్పుదారి పట్టించి ఇప్పుడు అజెండాలో ఎలా చేర్చుతారని కూటమి కార్పొరేటర్లు మండిపడుతున్నారు. మేయర్‌కు ముందస్తు ఆమోదం ఇచ్చే అధికారం లేనప్పటికీ, ఈ ఏడాది జనవరిలో ఆమోదించారని చెప్పడంపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తునారు. దీనిపై మేయర్‌ను నిలదీయడంతోపాటు ప్రాజెక్టును తరలించాలని డిమాండ్ చేస్తామని చెబుతుండడం చర్చనీయాంశంగా మారింది.

బాధితులకు సత్వర బీమా

... 5వ పేజీ తరువాయి

సహాయ కేంద్రాన్ని సంప్రతిస్తే పోలీస్‌శాఖ తరఫున సహాయం అందించి, సత్వరం బీమా పరిహారం అందేలా కృషి చేస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు రహదారి భద్రతపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 4,600 మంది ఆటోడ్రైవర్లున్నారని, వారిలో చాలామంది ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోజుకు 250 మంది చొప్పున 15 రోజులపాటు అందరికీ శిక్షణ ఇచ్చేలా కార్యక్రమం రూపొందించిన సీపీని అభినందించారు. పోలీస్ రికార్డులను భద్రపరిచేందుకు సదుపాయం లేకపోవడంతో ఆరు బయటే ఉంచాల్సి వస్తోందని, భద్రతకు ముప్పు పొంచి ఉందన్న అధికారుల వినతి మేరకు సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన అత్యాధునిక భద్రతా ప్రమాణాలు కలిగిన రెండు కంప్యూటర్ ఫైల్ ఆప్టిమైజర్‌లను సీసీఆర్‌బీ విభాగంలో మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, సీపీ శంఖబ్రతబాగ్చి, డీఐజీ గోపీనాథ్‌జెట్టీతోపాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు రద్దు

... 5వ పేజీ తరువాయి

నిలిపివేశారు. సుమారు ఏడాదిగా పనులు సాగలేదు. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల మంజూరులో కదలిక వచ్చింది. చివరకు అక్టోబరులో కొన్ని బిల్లులు విడుదల చేశారు. కాగా జిల్లాలో రూ.40 కోట్ల విలువైన పనులు పూర్తికావాల్సి ఉంది. ఇదిలావుండగా రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్లు ముందుకురాని 113 పనులు ఉండిపోయాయి. వీటి విలువ రూ.19.2 కోట్లుగా అప్పట్లో ప్రతిపాదించారు. రెండు మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాకపోవడంతో అధికారులు పెండింగ్‌లో పెట్టేశారు. కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులపై సమీక్షించిన సందర్భంలో కాంట్రాక్టర్లు ముందుకురాని పనులకు రద్దుచేయాలని వెల్లడించారు. దీనిపై అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. కానీ జిల్లాలో రూ.19.2కోట్లతో ప్రతిపాదించిన 113 పనులు రద్దుచేసి ప్రస్తుత రేట్ల మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనిలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులున్నారు. ప్రస్తుత రేట్ల మేరకు వీటి విలువ రూ.25 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు రూపొందించి, టెండర్లు ఆహ్వానించాలని అధికారులు నిర్ణయించారు.

హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ స్థలంలో రూ.4.63 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్

- ఎట్టకేలకు పనులు ప్రారంభం
- దశాబ్దాల తరబడి శిథిల స్థితిలో భవనాలు

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల తరబడి శిథిలావస్థలో ఉన్న హౌసింగ్ బోర్డు క్వార్టర్స్‌ను ఎట్టకేలకు కూల్చేశారు. ఇక్కడ కొత్త షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి టెండర్లు ఖరారు చేశారు.

నగరంలోని పాత వెంకోజీపాలెంలో 1980 దశకంలో హౌసింగ్ బోర్డు ఉద్యోగులు కుటుంబాలతో నివసించేవారు. కాలక్రమేణా ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. అనంతరం ఇసుకతోటలో ఉన్న హౌసింగ్ బోర్డు కార్యాలయాన్ని 2011లో ఇక్కడకు తరలించారు. ఈ క్వార్టర్స్ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించాలని భావించారు. కానీ ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో కొన్ని దశాబ్దాలుగా ఈ క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండిపోయాయి. ఫలితంగా సంస్థ రూ.కోట్లలో ఆదాయం కోల్పోయింది. స్థానిక అధికారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేకపోవడం కూడా నూతన భవన నిర్మాణ జాప్యానికి కారణంగా చెప్పొచ్చు.

ఈ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఎక్కువగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన ఈ క్వార్టర్స్‌ను కూలదోసి ఇక్కడ కూడా అలాంటివి కట్టాలనే ఆలోచన హౌసింగ్ బోర్డు అధికారులకు లేకపోవడం శోచనీయం. అయితే ఇప్పటికైనా అలాంటి ప్రణాళికతో అధికారులు ముందుకు రావడం మంచిదేనని పలువురు అంటున్నారు.


క్వార్టర్స్ తొలగించి చదును చేస్తున్న ప్రాంతం

ప్రస్తుతం చాలా వరకు క్వార్టర్స్ కూలగొట్టగా మిగిలిన భాగంలో హౌసింగ్ బోర్డు కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ 21 ఎకరాల విస్తీర్ణంలో స్టిల్ట్ ప్లస్ నాలుగు అంతస్తుల తరహాలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. అక్కయ్యపాలేనికి చెందిన చైతన్య కన్‌స్ట్రక్షన్ సంస్థ ఇక్కడ భవనాలు నిర్మించనుంది. రూ.4.63 కోట్లతో కొత్త భవనం నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నేల చదును చేశారు. త్వరలోనే నిర్మాణ పనులు చే

జి+4గా నిర్మాణం : ఈఈ రవికుమార్



ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాలాది రవికుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న కార్యాలయం సమీపంలో జీవీఎంసీ రోడ్డు విస్తరణ చేపట్టనుందని అధికారులు తెలిపారని, కొత్త భవనం అందుబాటులోకి వచ్చిన తరువాత తమ కార్యాలయాన్నిఆ భవనం నాలుగో అంతస్తులోకి మార్చనున్నట్టు తెలిపారు. ఈ నెలలోనే నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రవికుమార్ పేర్కొన్నారు. ఈ నిర్మాణంలో జి+4గా నిర్మించి నాలుగో అంతస్థులో తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, మిగిలిన వాటిని షాపింగ్ కాంప్లెక్సుగా ఏర్పాటు చేయాలని ప్రస్తుతం ఉన్న ప్రణాళిక అని చెప్పారు. స్థానికుల అభ్యర్థన, అవసరాల నిమిత్తం కల్యాణ మండపాన్ని కూడా నిర్మించవచ్చని అనుకుంటున్నామన్నారు. వీటి నిర్మాణం ద్వారా హౌసింగ్ బోర్డుకు ఏ విధంగా ఆర్థిక లాభం కలుగుతుందో ఆ విధంగా నిర్మాణం చేపట్టనున్నట్టు రవికుమార్ తెలిపారు. అంతేకాకుండా నూతన భవనం నిర్మాణం తరువాత ప్రస్తుతం ఉన్న కార్యాలయం మార్పు చేసి, అనంతరం ప్రస్తుత కార్యాలయ భవనాన్ని కూడా పడగొట్టి జీవీఎంసీ రోడ్డు విస్తరణ పోగా, మిగిలిన స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్సు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఆరిలోవ పోలీస్‌స్టేషన్ నూతన భవన ప్రారంభం


పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, ద్వారకాతిరుమలరావు


పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులో సంతకం చేస్తున్న హోంమంత్రి అనిత

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూ2.5 కోట్లతో హనుమంతవాక కూడలిలోని విమ్స్ ఆవరణలో నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఆదివారం ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ భవనంలోని వసతులను సీపీ శంఖబ్రత బాగ్చి ఆమెకు వివరించారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గదిలో కూర్చొని పోలీస్‌స్టేషన్ భవనాన్ని తాను ప్రారంభించినట్టు అనిత రికార్డులో సంతకం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్ షెల్టర్‌లోని ఒక గదిలో కొనసాగిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనాన్ని చూసినవారు ఎవరైనా జాలి పడేవారన్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు కొత్త భవనం కోసం విమ్స్ ఆవరణలో 2018లో శంకుస్థాపన చేసినప్పటికీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో భవన నిర్మాణం పూర్తికాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పోలీస్‌శాఖకు మౌలిక వసతులు కల్పించడం ద్వారా సమర్థంగా పని చేయించాలనే భావనతో రూ.2.5 కోట్లతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. మరో రూ.2.5 కోట్లతో అదనపు అంతస్తులు నిర్మించి ఏసీపీ కార్యాలయం, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు.

తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కొత్త పోలీస్‌స్టేషన్ భవనానికి వచ్చేవారు బీఆర్‌టీఎస్ రోడ్డును దాటాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఇక్కడ రూ.కోటితో వంతెన నిర్మాణానికి అంగీకరించారని తెలిపారు. కార్యక్రమంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీ ప్రశాంతి, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విమ్స్ డైరెక్టర్ రాంబాబుకు హోంమంత్రి అనిత సత్కారం


డాక్టర్ రాంబాబును సత్కరిస్తున్న హోంమంత్రి అనిత

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) డైరెక్టర్ కె.రాంబాబును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సత్కరించారు. ఆదివారం ఉదయం విమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విమ్స్ డైరక్టర్‌ను ఆమె సత్కరించారు. విమ్స్ ఆస్పత్రి అభివృద్ధికి చేస్తున్న విశేష కృషిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడంపై అభినందనలు తెలిపారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేసిన న్యాయవాదులు

విశాఖ (లీగల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌తో కలిసి విశాఖలో ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన ప్రాధాన్యతను వారికి వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయమూర్తులకు వివరించారు. హై కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వరులు, జస్టిస్ ఎం.జయసూర్యలను మర్యాదపూర్వకంగా కలిసి హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నరేశ్ న్యాయమూర్తులను కలిసిన వారిలో ఉన్నారు.


హైకోర్టు న్యాయమూర్తులతో విశాఖ న్యాయవాదుల సంఘం, బార్ కౌన్సిల్ ప్రతినిధులు

22వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వం నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, డిసెంబరు 8 : జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. టీడీపీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీలో చేరాలని కోరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, డొక్కర శ్రీనివాసరావు, కోడిబోయిన ఆనంద్, చోటా, నాగూర్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సబ్‌మెరైన్ దినోత్సవం


సబ్‌మెరైన్ ఫొటో గ్యాలరీ


మ్యూజికల్ బ్యాండ్ వాయిస్తున్న నేవీ సిబ్బంది

రామ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సబ్‌మెరైన్ దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం సాగర తీరంలో ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని కురుసురా సబ్ మెరైన్ మ్యూజియం వద్ద సబ్‌మెరైన్ నేవీ అధికారుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మ్యూజియం ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వివిధ సబ్‌మెరైన్ ఫోటోలతో గ్యాలరీ ఏర్పాటు చేశారు.

మ్యూజికల్ బ్యాండ్ ఏర్పాటు చేసి నేవీ బృందం సభ్యులు వివిధ గీతాలను వినిపించారు ఆదివారం బీచ్‌కు వచ్చిన పలువురు సందర్శకులు, పర్యాటకులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నేవీ అధికారులు పాల్గొన్నారు.

కనువిందుగా నృత్య సోయగం

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నృత్యరీతులు కనువిందు చేశాయి. కళాకారిణుల హావభావాలు కళ్లను కట్టిపడేశాయి. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన మయూరి నృత్యనికేతన్ 24వ వార్షికోత్సవంలో మయూరాల నాట్యాలు నయనమనోహరంగా సాగాయి. ఈ సందర్భంగా ఎం.సన్వి, సీహెచ్ గీతిక, బి.వైష్ణవి, పి.గమ్య, జి.శారదా, శ్రీవల్లిక, కె.కృతిక, జ్ఞాపిక. ఈ వేదికపై అరంగేట్రం చేసి తమ నృత్యాలతో మంత్రముగ్ధులను చేశారు. గజవదనా బేడువే గౌరి తనయ, జేమ జేమ తపన, గంధము పూయరుగా గానాలకు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అందెల రవళికి చేసిన కూచిపూడి నృత్యానికి ఆడిటోరియం చప్పట్లతో మారుమోగింది. శివాష్టకం భక్తిగానంతో ప్రదర్శించిన నృత్యానికి ప్రేక్షకులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఇట్టి ముద్దులాడి బాలుడేడివాడు, రారా నను నీకరుణ నేలుకోరా. చిన్ని శిశువు పాటలకు ప్రదర్శించిన రీతులు ఆనంద డోలికల్లో ముంచెత్తించాయి. కె.సూర్యనారాయణ గాత్రం, పి.గణపతి వయోలీన్, అనంతరావు మృదంగం, ఫణికుమార్ తబలాపై అందించిన వాయిద్యాలు వీనులవిందుగా సాగాయి. ముందుగా మయూరి నృత్యనికేతన్ సంగీత, నృత్య సంస్థ నిర్వహకులు గురు ఉషారాణి, ఎం.మురళీమోహన్ జ్యోతి ప్రజ్వాలన చేసి వార్షికోత్సవాలు ప్రారంభించారు.

రేపటి నుంచి జాబ్ మేళా

అక్కయ్యపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 10, 11 తేదీల్లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. పదో తేదీన కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డబ్ల్యూఎన్ఎస్, ఏడీహెచ్‌ఓసీ నెట్వర్క్, ఐ స్మార్ట్ సొల్యూషన్స్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. మంగళవారం ఉదయం 10-30 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు ఫోన్ : 9490632318లో సంప్రదించాలన్నారు. 11న గాజువాక పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సమీపంలోని నాక్ సెంటర్‌లో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఆ రోజు ఉదయం 10-30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9948768778 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా జర్నలిస్టుల వన సమారాధన


వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వీఎమ్మార్డీఏ సందర్శనీయ ప్రాంతాల్లో పాత్రికేయుల పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని సంస్థ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ హామీ ఇచ్చారు. శివాజీపార్కులో ఆదివారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల విశాఖ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా తాను ఎదిగేందుకు విశాఖ జర్నలిస్టులు అందించిన సహకారం మరవలేనిదని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి.నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సీతంపేట, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ గేట్ నెంబర్ మూడు ఆర్చి వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దీంతో స్థానికులు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ లేదా సీఐ విజయ్‌కుమార్ 94407 96012కు సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ మోదీ, చంద్రబాబు కుట్ర

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, మాజీ ఎంపీ హర్షకుమార్ విమర్శ


ఉత్తరాంధ్ర మాలల గర్జన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

సిరిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, అన్నారు. ఆదివారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఉత్తరాంధ్ర మాలల గర్జన కన్వీనర్ పతివాడ రాంబాబు అధ్యక్షతన ఉత్తరాంధ్ర మాలల గర్జన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హర్షకుమార్, మల్లెల వెంకటరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహనీయుల త్యాగాల బాట నుంచి రేపటి పిల్లల భవిష్యత్ కోసం మాలలంతా ఐక్యంగా పని చేసి వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం స్వార్ధ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చు రేపి వర్గీకరణ అంశంతో ఆటలాడుకుంటున్నారని, వారికి మానమంతా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు.రానున్న కాలంలో ఎస్సీలంతా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరారు. డాక్టర్ గోపీనాథ్, ఏయూ ప్రొఫెసర్ ఎన్‌పీడీ పాల్, ఎస్ఎన్ మూర్తి, నూకతోటి బాబురావు, పాల్తేటి పెంటరావు, కంఠవేణు, గంటాన అప్పారావు, పిరుబండి జయంతికుమార్, పెదపాటి మేఘరంజన్, మాత్రా చంద్రశేఖర్, బూసివెంకటరావు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఉదయ భాస్కర్ బృందం, జన చైతన్య కళాబృందం ఆలపించిన చైతన్య గీతాలు సభకులను ఆకట్టుకున్నాయి.

భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులకు ఆదివారం తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ పనులను రూ. 49 లక్షల జీవీఎంసీ నిధులతో పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు తెలుగుదేశం పార్టీ వార్డు నాయకులు గొలగాని పోలారావు, మంచినీటి సరఫరా విభాగం ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్యూఎంబీ చర్చి వజ్రోత్సవం


క్యూఎంబీ చర్చి వజ్రోత్సవంలో పాల్గొన్న క్రైస్తవులు

మద్దిలపాలెం, డిసెంబరు 8 : రేసపువానిపాలెంలోని క్యూఎంబీ చర్చి వజ్రోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో క్రీస్తుకు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్యూఎంబీ అధ్యక్షుడు టి.ఐజక్ మాట్లాడుతూ 1948 నుంచి 75 ఏళ్లుగా సంఘ పరిచర్యలు దినదిన ప్రవర్ధమానం చెందడంలో సహాయ సహకారాలందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాభివృద్ధికి శాయశక్తులా సేవలందించిన పూర్వపు సేవకుల పరిచర్యలను, త్యాగనిరతిని గుర్తు చేశారు. మద్దిలపాలెం పొలాల్లో పెంకుల ఇంటిలో ఉన్న చర్చి కాలక్రమేణా ఎదిగి విస్తరించిన క్రమాన్ని వివరించారు. 1961లో విశాఖ సందర్శనకు కెనడా నుంచి వచ్చిన క్వర్క్ అనుమతితో ఈ సంఘానికి ఆయన పేరు పెట్టినట్టు చెప్పారు. గత మూడు తరాలుగా తన తండ్రి గొంపాన పీటర్ సేవలందించిన సంఘానికి ప్రస్తుతం కాపరిగా పనిచేయడం దైవ సంకల్పమన్నారు. అనంతరం క్రైస్తవులకు ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పాస్టర్ చార్లీ మోజెస్, భాస్కరరావు, జి.ఐజియా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రిటైర్డ్ నేవీ ఉద్యోగుల సమావేశం


ఆటపాటల్లో పాల్గొన్న రిటైర్డ్ నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ నేవీ ఉద్యోగుల వైజాగ్ చార్టర్ జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. తూర్పు నావికాదళంలోని సముద్రికా ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సమావేశానికి రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్‌రాజు అధ్యక్షత వహించారు. విశాఖలోని సుమారు 500 మంది రిటైర్డ్ నేవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్య ఇబ్బందులు, సేవలు వంటి వాటి గురించి అభిప్రాయలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా గడిచిన ఏడాదిలో తమ సంస్థ ద్వారా సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలను తెలియజేశారు.నేవీ డే వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ అడ్మిరల్ రాజేష్ పెండఖర్‌తో పాటు రిటైర్డ్ నేవీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎమ్మెల్యే గంటాను కలిసిన జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు


గంటాను కలిసి వెంకటేశ్వర్లు తదితరులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో ఆదివారం ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కెఎస్ రావు, మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, ఏపీఆర్ఎస్ఏ సిటీ అధ్యక్షులు యోగి గంటాను కలిసిన వారిలో ఉన్నారు.

జూపార్కుకు పెరిగిన సందర్శకులు

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జూపార్కుకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. 9040 మంది సందర్శకులు సందర్శించడం ద్వారా రూ.6,63,775 ఆదాయం సమకూరినట్టు జూక్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పలు ఏర్పాట్లు చేసినట్లు ఆమె వెల్లడించారు.

కాలభైరవ స్వామి ఆలయంలో అష్టమి పూజలు


కాలభైరవ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలో వేంచేసి ఉన్న కాలభైరవస్వామికి అష్టమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గారెల దండలను వేశారు. కాలభైరవ స్వామి ఆవిర్భవించిన మార్గశిర శుద్ధ అష్టమిని కాలభైరవాష్టమిగా పిలుస్తారని, ఆదివారం భైరవుడికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజని, కనుక కాలభైరవున్ని పూజించడం వలన విజయం, సంపద, ఆరోగ్యం, అడ్డంకుల తొలగిపోతాయని అర్చకులు సూచించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మలు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, బోర యర్రాజీ రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, మద్దాల వీర వెంకట అప్పారావు, మహిళలు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 42, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 22, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 28, క్యారెట్ 70 దొండకాయలు 30, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)58, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

ముగిసిన కిక్ బాక్సింగ్ సెమినార్.. రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం నిర్వహించిన కోచ్, రిఫరీ సెమినార్, జాతీయ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. మహిళల విభాగంలో జయశ్రీ (గుంటూరు), వెంకటలక్ష్మి (రాజమండ్రి)... బాలికల కేటగిరిలో డి.సంజన (విశాఖ), తేజశ్విని (విజయనగరం), పురుషుల కేటగిరిలో ఎస్.లోకేష్ (విశాఖ), చందు (కర్నూలు)...బాలుర విభాగంలో శ్రీయాన్ (విశాఖ), అశ్విత్ (విజయనగరం) స్వర్ణ, రజత పతకాలు సాధించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ద ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, ఆలిండియా వాడోకై కరాటే సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కిక్ బాక్సింగ్ కార్యదర్శి ఆనంద బాలు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ జిల్లా క్లబ్ పురస్కారాలు

మురళీనగర్, డిసెంబరు 8 ; వాకర్స్ క్లబ్ జిల్లా 101 వార్షిక సమావేశంలో మురళీనగర్ వాకర్స్ జిల్లా ఉత్తమ క్లబ్ పురస్కారం లభించింది. ఆదివారం పురస్కారాలు అందజేశారు. ఉత్తమ అధ్యక్షుడి కేటగిరీలో మురళీనగర్ క్లబ్ 2024 ఏడాదికి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న పల్లా చంద్రమౌళికి పురస్కారం అందించారు. ఈ రెండ అవార్డులను వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు చేతుల మీదుగా అందజేసారు. క్లబ్ పురోగతికి కృషిచేసిన చంద్రమౌళిని సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ప్రసాదరావు, ఎన్.ప్రకాశరావు,మాధవ ధార మహిళావాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

2025 ఏడాదికి కొత్త కమిటీ ఎన్నిక

మురళీనగర్ వాకర్స్ క్లబ్ 2025 పాలకవర్గ అధికారులు, బోర్డు మెంబర్ల ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.భానుప్రకాష్, ఉపాధ్యక్షునిగా జి.విజయలక్ష్మి, సెక్రటరీ సీహెచ్ సత్యసూర్య వరప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎన్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. వీరితో పాటు ఒక జాలీవాకర్ మరో 9 మంది బోర్డు డైరెక్టర్లు ఎన్నికయ్యారు.

యువత మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

» ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

సీతంపేట, డిసెంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల పరిరక్షణకు మరింత సమర్థంగా చేపట్టేందుకు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశ సూత్రలు కూడా పూర్తిస్థాయిలో చట్ట బద్ధత కల్పించాల్సిన అవసం ఉందని నాగార్జున యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. అయితే యువత మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు.

బుల్లయ్య కళాశాల్లో గల గాంధీ సెంటర్ హాలులో టీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హర్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రీలిజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవ పత్యేక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గౌరవం, స్వేచ్ఛ, అందరికీ న్యాయం సాధించంలో యువత మానవ హక్కుల పరిరక్షణలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విషయలో యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఏయూ మాజీ ఆచార్యులు పదయ్య, డాక్టర్ కెవిఎస్ఎస్ మూర్తి, మున్నార్, తదితరులు పాల్గొన్నారు.

భద్రత లేని 'బాల్యం'

» శిథిల స్థితికి చేరిన విద్యా కేంద్రం
» భయంభయంగా పిల్లల చదువులు
» ఆందోళనలో సిబ్బంది, తల్లిదండ్రులు
» ముప్పులో 30 ఏళ్లనాటి భవనం


చెట్టు ఆనుకొని పెరగడంతో ప్రమాద స్థితిలో ఉన్న భవనం


శిథిల భవనంలోనే విద్యార్థులకు బోధన

అక్కయ్యపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సాలిగ్రామపురం సమీప కొండ ప్రాంతమైన సింహగిరి కాలనీలోని బాలల భవనం శిథిల స్థితికి చేరింది. ఇందులోనే చిన్నారుల బోధన సాగుతోంది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 1982లో ఆవిర్భవించిన ఈ కాలనీలో 1985లో సామాజిక భవనం కోసం దీన్ని నిర్మించారు. 2008లో బాలలు చదువుకునేందుకు వీలుగా ఈ భవనంలో బాల్వాడీ పాఠశాల నిర్వహిస్తూ వచ్చారు. ఆ తర్వాత ఇది 'బాల్యం'గా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 25 మంది పిల్లలు చదువుతున్నారు. టీచర్ జి.వరలక్ష్మి, ఆయా ఎస్కే ఖాజా విధులు నిర్వహిస్తున్నారు.రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3-30 గంటల వరకు పిల్లలకు చదువు చెబుతుంటారు. ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో మూడు దశాబ్దాల ఈ భవనం ప్రస్తుతం శిథిల స్థితికి చేరింది. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. భవనం లోపల, బయట గోడలు పగిలిపోయాయి. కొన్నినెలల క్రితం వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, జీవీఎంసీ అధికారులు ఈ భవనాన్ని పరిశీలించి త్వరలోనే దీన్ని కూలగొట్టి నూతన భవనం నిర్మిస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకూ ఏ చర్యలు తీసుకోలేదు. ఈ భవనానికి ఆనుకొని ఓ చెట్టు ఉంది. దీన్ని తొలగిస్తే భవనం కూడా పడిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఈదురు గాలులు వీచే ప్రతిసారి స్థానికులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతుంటారు. ఎక్కడ చెట్టు కూలిపోతుందా? పిల్లలకు ఏ ప్రమాదం ముంచుకొస్తుందా? అని గాబరా పడుతుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిల స్థితికి చేరిన ఈ బాల్యం భవనాన్ని కూలగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ బాల్యం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్ వరలక్ష్మికి రూ.7 వేలు, ఆయా ఎస్కే ఖాజాకు రూ. 4 వేలు వంతున వేతనమిస్తున్నారని, ఆ మొత్తం కుటుంబ పోషణకు చాలడం లేదని వాపోయారు. తమ వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్


చాంపియన్‌గా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు


రన్నరప్‌గా నిలిచిన విశాఖ స్విమ్మర్లు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వింటర్ సబ్ జూనియర్, జూనియర్ బాలుర బాలికల ఆక్వాటిక్ టోర్నీలో ఎన్టీఆర్ జిల్లా 199 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆతిథ్య విశాఖ స్విమ్మర్లు 95 పాయింట్లతో ఓవరాల్ రన్నరప్ ట్రోఫీని సాధించారు. కడప జిల్లా స్విమ్మర్లు 84 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలవగా, 72 పాయింట్లతో ఏలూరు, 70 పాయింట్లతో చిత్తూరు మూడు, నాలుగు స్థానాలను దక్కించుకున్నారు. గ్రూప్-2 బాలుర విభాగంలో బి.స్వామినాయుడు (ఏలూరు), త్రిభునవ్ రెడ్డి (కడప), బాలికల విభాగంలో యమర్తి పార్థవి (కృష్ణా), గ్రూప్-2 బాలుర కేటగిరిలో ఎల్.కార్తికేయ దేవ రాయల్ (కడప), బాలికల విభాగంలో సీహెచ్ అవిజ్ఞ (బాపట్ల), గ్రూప్-1 బాలురవిభాగంలో ఎం.శరత్ (ఎన్టీఆర్), బాలికల విభాగంలో ఎన్.పావని శరయు,యు.ప్రేమామృత (ఎన్టీఆర్) వ్యక్తిగత చాంపియన్స్‌గా నిలిచారు.ఆదివారం సాయంత్రం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానిక ద ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సౌత్‌జోన్ జాతీయ స్విమ్మింగ్ టోర్నీలో పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో రాష్ట్ర స్విమ్మింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.మోహన్ వెంకటరామ్ పాల్గొనగా. టోర్నీ పర్యవేక్షకునిగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ నుంచి స్విమ్మింగ్ కోచ్ నాయుడు వ్యవహరించారు.

వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ


ట్రోఫీ ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వాడోకై కరాటే జో అసోసియేషన్, డ్రాగన్ ఫోర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించనున్న రెండవ వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీ ట్రోఫీని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పోర్టు అథారిటీ స్టేడియంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా డిసెంబరు 15 నుంచి పోటీలు జరుగుతాయని, దేశ వ్యాప్తంగా సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని టోర్నీ నిర్వాహకుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల అప్పారావు, అక్కిరెడ్డి జగదీష్, కరాటే సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పాదుకా ఆరాధన పూజ


అనుగ్రహ భాషణ చేస్తున్న చిన జీయర్ స్వామి


పాదుకలను భక్తులతో అందజేస్తున్న చినజీయర్ స్వామి

సీతమ్మధార, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి) : దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాలకులు మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థిద్దామని ఆధ్యాత్మిక అచార్యులు త్రిదండి చిన జీయరు స్వామి పిలుపునిచ్చారు.

సీతమ్మధారలోని వర్మ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం శ్రీరామ పాదకా ఆరాధన పూజ వైభవంగా నిర్వహించారు. జీయర్ స్వామి వారి ప్రత్యేక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో భాగంగా భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. అనంతరం జీయర్ స్వామి స్వయంగా భక్తులందరికీ శ్రీరామ పాదుకలు అందించారు. శ్రీరామ సహస్ర నామాలతో పూజ చేయించారు.

దేశం రాష్ట్రం అభ్యున్నతి చెందడానికి మనవంతు బాధ్యతగా స్వామిని ప్రార్థించాలన్నారు. అంతకుముందు శ్రీరామ పాదుకలను కోలాటాలు, భజలు, వేద పారాయణంతో భక్తులు తలపై పెట్టుకొని ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో వికాస తరంగణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ఎస్ఆర్ వర్మ, వారిజ వేద పాఠశాల అధ్యాపకులు ఎం.శ్రీకాంత్‌స్వామి, సంతోష్‌కుమార్ స్వామి, వారిజ కమిటీ సభ్యులు ఎంఎస్ రాజు, కాశి రాజు, సాతూలురి రామానుజం నారాయణ రెడ్డి, నేత్ర విద్యాలయ నిర్వాహకులు శిరిష తదితరులు పాల్గొన్నారు.

» మేరీమాత దర్శనానికి పోటెత్తిన భక్తులు
» శనివారం రాత్రి నుంచే రాక

వైభవంగా కొండగుడి ఉత్సవం


దర్శనానికి తరలివచ్చిన విశ్వాసకులు (ఇన్‌సెట్లో) మేరీమాత

జ్ఞానాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత పోస్టాఫీసు సమీపంలో ఉన్న రోజ్ హిల్ అమలోద్భవిమాత (కొండగుడి) ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో రహదారులన్నీ జన సంద్రంగా మారాయి. ఎటుచూసినా ఉత్సవ సందడి కనిపించింది. భక్తులు కొండకు చేరుకుని మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి నుంచే కొందరు కొండగుడికి చేరుకోవడంతో వీధు లన్నీ కిటకిటలాడాయి. పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనల అనంతరం తెల్లవారుజామున నాలుగు గంటలకు భక్తులను కొండపైకి అనుమతించారు. ఐదు గంటల నుంచి ఆలయంలో తెలుగు, ఇంగ్లీష్‌లో దివ్య పూజ బలులు నిర్వహించారు. 7.30 నిమిషాలకు గుహ వద్ద నల్గొండ పీఠాధిపతుల ఆధ్వర్యంలో తెలుగులో పోంటిఫికల్ దివ్య పూజా బలి జరిపారు. సాయంత్రం 6 గంటల వరకూ దివ్య పూజలు జరిగాయి. మధ్యాహ్నం కొండదిగువన ఉన్న సెయింట్ ఆలోషియస్ స్కూల్ ఆవరణలో పరిశుద్ధ జపమాల చేసి స్కూల్ నుంచి కొండగుడికి విశాఖపురి మేరీమాత తేరుతో భక్తి ప్రవత్తులతో విశ్వాసకులు ప్రదక్షిణ చేశారు.అనంతరం గుహ వద్ద దివ్య సత్ప్రసాద ప్రతిష్ఠ నిర్వహించారు. ఈసందర్భంగా రాజమహేం ద్రవరానికి చెందిన విచారణకర్త రెవరెండ్ ఫాదర్ ఈగల రవీంద్ర కుమార్, విశాఖ ప్రొవెన్షియల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ పి. చిన్నప్పరెడ్డి, కొండగుడి డైరెక్టర్ డోలా వేలాంగిణిరావు, ఫాదర్లు థామస్ పుల్లాట్, కొండాల జోసెఫ్, తంబిరాజు, బ్రదర్ మైఖేల్ ఒలికల్, బ్రదర్ బాలరాజ్ తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి, ఉత్సవ ప్రాధాన్యతపై భక్తులకు వివరించారు. కాగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపారు. కొండ దిగువున ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్త రోడ్డు, చిలకల కూడలి వరకు మాత్రమే ఆటోలను అనుమతించారు. భక్తులు కాలినడకన కొండకు చేరుకునేందుకు రోడ్డు పక్కనున్న ఆక్రమణలను తొలగించారు.

వన్‌టౌన్‌లో సందడే. సందడి

జగదాంబ కూడలి : కొండగుడి మేరీమాత ఉత్సవం నేపథ్యంలో వన్‌టౌన్ ప్రాంతం ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో సందడిగా మారింది. క్రైస్తవులతో పాటు బురుజుపేట కనకమహాలక్ష్మి దర్శనానికి వచ్చిన భక్తులతో రహదారి కిటకిటలాడింది.వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రాణిబొమ్మ నుంచి కోటవీధి కొండగుడి వరకు పరిసరాలు పూర్తిగా జనంతో నిండిపోయాయి. రాణి విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సులు, వాహనాలను పోలీసులు నిలిపివేశారు

ఆరు నెలల్లో 172 కేసులు పరిష్కారం : సీపీ



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పక్కన డీసీపీ లతా మాధవి

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పెరిగిపోతున్న సివిల్ కేసులను కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా పరిష్కరిస్తున్నామని సీపీ శంఖబ్రాత బాగ్చి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈఏడాది జూలై 1 నుంచి డిసెంబరు 3 వరకు ప్రీ లిటిగేషన్ కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా 172 కేసులను పరిష్కరించామని చెప్పారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం పొందిన వారితో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ లతామాధవి కూడా పాల్గొన్నారు.

'హిందువులపై దాడులను అరికట్టాలి'

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు చిన్మయి కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ జైలు నుంచి విడిపించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని రాధారంగా రాయల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం వారు బీచ్‌రోడ్డులో అన్నమయ్య విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు హిందువులపై దాడులకు పాల్పడుతున్నాయని, ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు చిన్మయ కృష్ణదాస్‌ను అక్రమంగా అరెస్టు చేసి, బెయిల్ రాకుండా అడ్డుకోవడం దారుణమని తెలిపారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.

హార్స్‌రైడింగ్ ప్రాజెక్టుపై వివాదం

... 5వ పేజీ తరువాయి


ప్రాజెక్టు కోసం పార్కులో తొలగించిన చెట్లు

ప్రాజెక్టు పూర్తి చేసేందుకు వీలుగా మేయర్ ఇచ్చిన ముందస్తు ఆమోదాన్ని ర్యాటిపై చేయాలంటూ ఈనెల 11న జరగనున్న కౌన్సిల్ సమావేశం ఎజెండాలో చేర్చడం చర్చనీయాంశమైంది. దీనిని అడ్డుకునేందుకు కొందరు కార్పొరేటర్లు సమాయత్తమవుతున్నారు.

నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 1901లో ముడసర్లోవ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇది 80 ఎకరాల్లో విస్తరించింది. సుమారు 4,216 ఎకరాల పరీవాహక ప్రాంతం ఉంది. రిజర్వాయర్‌ను ఆనుకుని 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్కులో అనేక చెట్లున్నాయి. పార్కుకు ఒకవైపు రిజర్వాయర్, మరోవైపు అడవి ఉండడంతో పక్షుల ఆవాసానికి అనుకూలం. పార్కులో సుమారు 105 రకాల జాతుల పక్షు లు, ఇతర జీవులు ఉన్నట్లు పర్యావరణవేత్తలు చెబుతున్నా రు. ఈ ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ గత కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ సుమారు రూ.ఆరు కోట్ల వ్యయంతో గుర్రపుస్వారీ పార్కుని నిర్మించాలని నిర్ణయించారు. గుర్రాలను ఉంచేందుకు షెడ్లు, ఆలనాపాలనా చూసే సిబ్బందికి నివాసాలు, స్వారీ కోసం ట్రాక్ కోసం పార్కులో నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్‌తో భారీ నిర్మాణాలు చేపట్టడంపై పర్యావరణ వేత్తలు అభ్యంతరం తెలిపారు. పైగా ఆ ప్రాంతంలో యంత్రాలను ఉపయోగించి పురాతన చెట్లను తొలగించేస్తున్నారని, దీనివల్ల జీవ సమౌతాల్యానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రాజెక్టును తక్షణంనిలిపేయడం ద్వారా 105 రకాల జీవజాతులను పరిక్షించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశారు. దీంతో జీవీఎంసీ అధికారులు నాలుగు నెలల కిందటే ప్రాజెక్టు పనులను అర్థాంతరంగా నిలిపేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును మరొకచోటకు తరలిస్తారనే ఊహాగానాలు వినిపించాయి. ఇంతలో ఈనెల 11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి నిర్ణయించారు. ఈ మేరకు అజెండా లో చేర్చారు. గుర్రాలస్వారీ ప్రాజెక్టుకు జీవీఎంసీకి చెందిన ఏకైక తాగునీటి రిజర్వాయర్ మనుగడతోపాటు పార్కులో జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే ప్రాజెక్టును నిలిపేస్తున్నట్టు తప్పుదారి పట్టించి ఇప్పుడు అజెండాలో ఎలా చేర్చుతారని కూటమి కార్పొరేటర్లు మండిపడుతున్నారు. మేయర్‌కు ముందస్తు ఆమోదం ఇచ్చే అధికారం లేనప్పటికీ, ఈ ఏడాది జనవరిలో ఆమోదించారని చెప్పడంపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తునారు. దీనిపై మేయర్‌ను నిలదీయడంతోపాటు ప్రాజెక్టును తరలించాలని డిమాండ్ చేస్తామని చెబుతుండడం చర్చనీయాంశంగా మారింది.

బాధితులకు సత్వర బీమా

... 5వ పేజీ తరువాయి

సహాయ కేంద్రాన్ని సంప్రతిస్తే పోలీస్‌శాఖ తరఫున సహాయం అందించి, సత్వరం బీమా పరిహారం అందేలా కృషి చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం,చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు రహదారి భద్రతపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 4,600 మంది ఆటోడ్రైవర్లున్నారని, వారిలో చాలా మంది ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోజుకు 250 మంది చొప్పున 15 రోజులపాటు అందరికీ శిక్షణ ఇచ్చేలా కార్యక్రమం రూపొందించిన సీపీని అభినందించారు. పోలీస్ రికార్డులను భద్రపరిచేందుకు సదుపాయం లేకపోవడంతో ఆరు బయటే ఉంచాల్సి వస్తోందని, భద్రతకు ముప్పుపొంచి ఉందన్న అధికారుల వినతి మేరకు సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన అత్యాధునిక భద్రతా ప్రమాణాలు కలిగిన రెండు కంప్యూటర్ ఫైల్ ఆప్టిమైజర్‌లను సీసీఆర్‌బీ విభాగంలో మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, సీపీ శంఖబ్రతబాగ్చి, డీఐజీ గోపీనాథ్‌జెట్టీతోపాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల దందా!

... 5వ పేజీ తరువాయి

జరుగుతుంటాయి. అయితే ఈ విభాగం ఉండే టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లు దాదాపు పదేళ్లుగా అక్కడే తిష్ట వేశారు. అందులో ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు. కానీ వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేయిస్తుండడం విశేషం. వర్క్ ఇన్‌స్పెక్టర్లు వార్డుల్లో ఉంటూ ఇంజనీరింగ్ పనులు పర్యవేక్షించడం, పూర్తైన పనులకు కొలతలు, ఎం బుక్‌లో రికార్డు చేయడంలో ఏఈలకు సహకరించాలి. కానీ దానికి విరుద్ధంగా వర్క్ ఇన్‌స్పెక్టర్లను కంప్యూటర్ ఆపరేటర్ల పనికి నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వారిదే రాజ్యం

టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ముగ్గురే విభాగాన్ని శాసిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఏదైనా పనికి అధికారులు అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారుల ఆమోదం తర్వాత టెండర్లు పిలుస్తారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లే టెండర్లను తయారుచేసి సంబంధిత జోన్ డ్రాయింగ్ బ్రాంచీలకు (డీబీ) పంపిస్తారు. ఆ సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లను పిలిచి టెండర్ ఎంత లెస్‌కు వేయాలో సూచించి, వారికే వచ్చేలా చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఆయా పనులు పూర్తయిన తర్వాత ఎంబుక్ ప్రకారం బిల్లు తయారుచేసి డీబీలకు పంపినప్పుడు కూడా ఏంచేయాలనే దానిపై వారే ఉన్నతాధికారులకు సలహాలు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల పేరుతో కాంట్రాక్టర్ల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీరితోపాటు జోన్-8 నీటి సరఫరా విభాగంలో ఇద్దరు అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు చక్రం తిప్పుతున్నారని, అక్కడ పనిచేస్తే వారిద్దరినీ ప్రసన్నం చేసుకోవాల్సిందేనని, లేదంటే బిల్లుల కోసం ముప్పుతిప్పలు పెడతారని గగ్గోలు పెడుతున్నారు. వీటన్నింటిపైనా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీనిని బట్టి వారి అండదండలున్నాయని తేలిందన్నారు. దీంతో చేసేదిలేక కంప్యూటర్ ఆపరేటర్లు చెప్పినట్టుగానే చేసుకుంటూ పోతున్నామని కాంట్రాక్టర్లు నిట్టూరుస్తున్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు రద్దు

... 5వ పేజీ తరువాయి

నిలిపివేశారు. సుమారు ఏడాదిగా పనులు సాగలేదు. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లుల మంజూరులో కదలిక వచ్చింది. చివరకు అక్టోబరులో కొన్ని బిల్లులు విడుదల చేశారు. కాగా జిల్లాలో రూ.40 కోట్ల విలువైన పనులు పూర్తికావాల్సి ఉంది.

ఇదిలావుండగా రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్లు ముందుకురాని 113 పనులు ఉండిపోయాయి. వీటి విలువ రూ.19.2 కోట్లుగా అప్పట్లో ప్రతిపాదించారు. రెండుమూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాకపోవడంతో అధికారులు పెండింగ్‌లో పెట్టేశారు. కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులపై సమీక్షించిన సందర్భంలో కాంట్రాక్టర్లు ముందుకురాని పనులకు రద్దుచేయాలని వెల్లడించారు. దీనిపై అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. కానీ జిల్లాలో రూ.19.2కోట్లతో ప్రతిపాదించిన 113 పనులు రద్దు చేసి ప్రస్తుత రేట్ల మేరకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనిలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులున్నారు. ప్రస్తుత రేట్ల మేరకు వీటి విలువ రూ.25 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు రూపొందించి, టెండర్లు ఆహ్వానించాలని అధికారులు నిర్ణయించారు.

ఆస్తమాతో ఉక్కిరిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

రోజులకు మించి దగ్గు, ఆయాసం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. రెండు వారాలుగా కేసులు రెట్టింపు అయ్యాయని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయని ఆయన వెల్లడించారు. అలర్జీ వల్ల ఆస్తమా కేసులు పెరుగుతాయని, ఈ సీజన్‌లో గాలి తీసుకునే మార్గాలు డ్రై కావడంతో దుమ్ము, ధూళి కణాలు లోపలకు వెళ్లి ఆస్తమా బారినపడేలా చేస్తాయని కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. గతంలో పోలిస్తే ఆస్తమా పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. గాలి తీసుకునే మార్గాల్లోని మజిల్స్ కుచించుకుపోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సీతంపేట, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ గేట్ నెంబర్ మూడు ఆర్చి వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దీంతో స్థానికులు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ లేదా సీఐ విజయ్‌కుమార్ 94407 96012కు సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



డాబాగార్డెన్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ద్వారకానగర్ జంక్షన్ వద్ద శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. 108 సిబ్బంది అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీలక్ష్మీ తెలిపారు. మృతుడికి 55 నుంచి 60 ఏళ్ల ఉంటాయని, చామన చాయ రంగుతో మాసిన గడ్డంతో ఉన్నారని తెలిపారు. వివరాలు తెలిసిన వారు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రతించాలని ఆమె సూచించారు.



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కమనీయం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కూర్మన్నపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల పర్యవేక్షణలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. 87వ వార్డు కణితి పద్మశాలివీధిలో శ్రీఉమా మార్కండేశ్వరస్వామి ఆలయంలోనూ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. అదేవిధంగా వడ్లపూడిలోని శ్రీసీతారామలింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యుని కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

ముగిసిన షష్ఠి మహోత్సవాలు



వెయ్యి దీపాలతో జ్యోతిర్లింగార్చన

ఎస్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి ఎస్ఏడీ శాంతినగర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలతో పాటు కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం వెయ్యి దీపాలతో జ్యోతిర్లింగార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 88వ వార్డు ఎస్టీబీఎల్ కాలనీలో ఆదివారం అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు,సింధూర పూజలు, హోమాలు జరిపారు. పలువురు భక్తులు సుందరాకాండ పారాయణాన్ని పఠించారు. ఎస్టీబీఎల్ బాలాజీ, జీవీ కృష్ణయ్య, మహేశ్, చైతన్య కృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

పెదగంట్యాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ జంక్షన్‌లో పీబీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ట్రస్టు అధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు, పాఠకులు వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలచెరువు శివాలయం కమిటీ సభ్యులు డీఎస్ఎన్ రెడ్డి, వర్మ, లాయర్ లక్ష్మణరావు, కె.శ్రీనివాసరెడ్డి, కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2: జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి(గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 22, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18,కాలీఫ్లవర్ 26, క్యాబేజి 28, క్యారెట్ 70 దొండకాయలు 30, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)58, బరబాటి 28, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 32 దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25,బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 48, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుం పలు 32, కంద 58, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	296
స్కిన్‌లెస్	206



జింక్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



కరాటేలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

గాజువాకలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు కృషి | తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జింక్ మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ క్రికెట్‌లో రాణించిన వివేక్, వేణుగోపాల్, నితీశ్‌కుమార్, శ్రీకాంత్ వంటి క్రీడాకారులు ఇక్కడే ఆడారని గుర్తు చేశారు. గాజువాకలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తానని పల్లా పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాస్, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ప్రసాదుల శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, క్రీడా ప్రతినిధులు రెడ్డి, గాంధీ, రమణ, అచ్యుతరావు, నగేశ్, తదితరులు ల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

ఆటోనగర్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తి ఘనమని యాపిల్ ఐ స్కూల్ చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాల, యాపిల్ ఐ స్కూల్‌లో ఆదివారం ది షో ఆఫ్ ఛాంపియన్స్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల దేశానికి కీర్తి లభిస్తుందన్నారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఏటా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించి వారిలోని నైపుణ్యాలను వెలికితీస్తామన్నారు. ప్రిన్సిపల్ ఎస్.విష్ణువర్ధనరావు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందన్నారు. పలు క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు



పోలీస్ స్టేషన్‌లోని రికార్డులో సంతకం చేస్తున్న హోంమంత్రి అనిత

ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, డీజీపీ ద్వారకాతిరుమలరావు

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూ.2.5 కోట్లతో హనుమంతవాక కూడలిలోని విమ్స్ ఆవరణలో నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఆదివారం ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ భవనంలోని వసతులను సీపీ శంఖబ్రత బాగ్చి ఆమెకు వివరించారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గదిలో కూర్చొని పోలీస్‌స్టేషన్ భవనాన్ని తాను ప్రారంభించినట్టు అనిత రికార్డులో సంతకం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ షెల్టర్‌లోని ఒక గదిలో కొనసాగిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్ భవనాన్ని చూసినవారు ఎవరైనా జాలి పడేవారన్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు కొత్త భవనం కోసం విమ్స్ ఆవరణలో 2018లో శంకుస్థాపన చేసినప్పటికీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో భవన నిర్మాణం పూర్తికాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పోలీస్‌శాఖకు మౌలిక వసతులు కల్పించడం ద్వారా సమర్థంగా పని చేయించాలనే భావనతో రూ.2.5 కోట్లతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. మరో రూ.2.5 కోట్లతో అదనపు అంతస్తులు నిర్మించి ఏసీపీ కార్యాలయం, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కొత్త పోలీస్‌స్టేషన్ భవనానికి వచ్చేవారు బీఆర్‌టీఎస్ రోడ్డును దాటాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఇక్కడ రూ.కోటితో వంతెన నిర్మాణానికి అంగీకరించారని తెలిపారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీ ప్రశాంతి, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమంపై యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు ఇంటక్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు విభాగాలలో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, దీనివల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జీతాలు లేక ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం'

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పలువురు కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అప్పికొండలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణ కోసం చేసే పోరాటాల్లో ఉద్యోగులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనవలసిందిగా కోరారు. రాష్ట్రానికే మణిహారంగా ఉన్న స్టీల్‌ప్లాంటును కార్పొరేట్లకు అప్పగించే కుట్రను అడ్డుకునేందుకు ప్రతిఒక్కరూ ఉక్కు ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో యువ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని ఏఐటీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, ఫుల్ అండ్ ఫైనల్‌ను కాంట్రాక్టర్లు సక్రమంగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సొంబాబు, అలమ్, నాయుడు, ఆయా విభాగాల సైట్ లీడర్లు పాల్గొన్నారు.



వేపగుంట పినగాడి రోడ్డులో ధర్నా చేస్తున్న బాధితులు

రోడ్డు విస్తరణ తగ్గించాలని కోరుతూ ధర్నా

వేపగుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):వేపగుంట నుంచి పినగాడి రోడ్డు విస్తరణలో నష్ట పోతున్న బాధితులు తమకు న్యాయం చేయాలని ఆదివారం రాత్రి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు విస్తరణను మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 అడుగులకు విస్తరిస్తే తాము తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటామని, ఈ స్థితిలో విస్తరణను 60 నుంచి 80 అడుగుల వరకే పరిమితం చేయాలని నినాదాలు చేశారు. బీఆర్‌టీ ఎస్ రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారంలేదని, అటువంటిది ఈ మార్గం 150 అడుగుల వరకు విస్తరించటం ఎంతవరకు సమంజసం అని వారుప్రశ్నించారు. విస్తరణలో నష్టపోతున్నతమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దాదాపు అర్ధగంటపాటు కుటుంబాలతో ఈ ఆందోళన చేశారు.

మాతృశ్రీ నగర్ గౌరవాధ్యక్షునిగా 'పల్లా'

కూర్మన్నపాలెం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీ నగర్ కాలనీలో ఆదివారం కాలనీ ప్లాట్ అండ్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ గౌరవాధ్యక్షునిగా పల్లా శ్రీనివాసరావు, అధ్యక్షునిగా నల్లూరు సూర్యనారాయణ, కార్యదర్శిగా రాళ్లపల్లి భీమప్రసాద్, కోశాధికారిగా డి.రవీంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా పి.రామరాజు, ఆర్.సుధీర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐ.అప్పలరాజుతో పాటు పలువురు సభ్యులుగా ఎంపికయ్యారు. వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ పల్లా ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

పెందుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్‌పురంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 మద్యం సీసాలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిన్నాల అప్పారావు అనే వ్యక్తి ఇంట్లో 50 క్వార్టర్ మద్యం సీసాలను భద్రపరిచినట్టు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రోల్‌బాల్ భారతీయ సనాతన క్రీడ: ఎమ్మెల్యే గణబాబు

వేపగుంట డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం పెట్రోల్‌బంకు దరి ఆర్.ఆర్.వి.పురంలో ఉన్న ఆళ్వార్స్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం రోల్‌బాల్ క్రీడల పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా తొలుత ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ముగింపు మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోల్‌బాల్ క్రీడ భారతీయ సనాతన క్రీడగా వర్ణించారు. ఈ క్రీడ అభివృద్ధికి రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చివరి మ్యాచ్‌ను తిలకించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ క్రీడల నిర్వహణకు సహకరించిన గోపాలపట్నం ఆళ్వార్స్ యాజమాన్యం, కో ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోల్‌బాల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ రెడ్డి, సౌత్‌జోన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపకార్యదర్శి సాజి, జిల్లా కార్యదర్శి తోట లలిత ప్రియ, జిల్లా కోచ్ పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోల్ బాల్ ముగింపు మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

చేయి చేయి కలిపి శ్మశానాన్ని బాగు చేశారు

పెదగంట్యాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీ శ్మశానవాటికను స్థానిక యువకులు ఆదివారం శుభ్రపరిచారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పిలుపు మేరకు బాపూజీ కాలనీ, ప్రియదర్శనీ కాలనీ, గిరిజా కాలనీ, వికాస్‌నగర్‌లకు చెందిన యువకులు ఆదివారం ఉదయమే శ్మశానవాటికకు చేరుకుని శుభ్రంగా తీర్చిదిద్దారు. శ్మశానంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించడంతో పాటు చీపుళ్లతో ఊడ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు, జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



శ్మశానాన్ని శుభ్రపరుస్తున్న దృశ్యం

దువ్వాడ రైల్వే స్టేషన్లో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వల్ల ఎలాంటి అంటురోగాలు దరిచేరవని కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధరరెడ్డి, రైల్వే జోనల్ యూజర్స్ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్‌లు అన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, అగనంపూడి, లయన్స్ క్లబ్ సభ్యులు, యంగ్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సత్యసాయి సేవా సమితి, మానవతా సమితి, స్పందన చేయూత, మానవ వికాస వేదిక, సర్వహిత చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1-4 ప్లాట్‌ఫారమ్‌లు, రైల్వే పరిసరాలలో తదితర ప్రాంతాలలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, జాషువా, వీర్రాజు, కేవీ ప్రసాద్, రామకృష్ణ, కోటేశ్వరరావు, నాయుడు, రాజు, లక్ష్మీమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్య, నాటక కళాకారుల వన సమారాధన

అగనంపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పద్య, నాటక కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గాజువాక పౌరాణిక నాటిక కళాకారుల సంఘం అధ్యక్షుడు కురిటి సత్యంనాయుడు మాట్లాడుతూ కళాకారులందరినీ ఒక చోటకు చేర్చి వన సమారాధనను ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. కళాకారులంతా సత్యంనాయుడును ఘనంగా సత్కరించారు. సంఘం ప్రతినిధులు కట్టా పైడిరాజు, శివప్రసాద్, గణపతి, కృష్ణవేణి, వాసు, కోరాడ అప్పారావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కూర్మన్నపాలెం, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ గ్లోరియో స్కూల్ రోడ్డులో ఆదివారం విశాఖ మెడికల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తులతో విశాఖ న్యాయవాదుల సంఘం, బార్ కౌన్సిల్ ప్రతినిధులు

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేసిన న్యాయవాదులు

విశాఖ లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌తో కలిసి విశాఖలో ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన ప్రాధాన్యతను వారికి వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయమూర్తులకు వివరించారు. హై కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వరులు, జస్టిస్ ఎం.జయసూర్యలను మర్యాదపూర్వకంగా కలిసి హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నరేశ్ న్యాయమూర్తులను కలిసిన వారిలో ఉన్నారు.

2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

గాజువాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని గాజువాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్కాపురం ప్రాంతం నుంచి సబ్బవరానికి బొలేరో వాహనంలో అచ్చిబాబు అనే వ్యక్తి సుమారు రెండు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి మింది-బీహెచ్‌పీవీ మార్గంలో పట్టుకున్నారు. బియ్యంతో పాటు వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెందుర్తి మండలంలో 1,250 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెందుర్తి: మండల పరిధి ప్రశాంతినగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1250 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. ముందస్తు సమాచారంతో ఆదివారం విజిలెన్స్ అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నాగేశ్వరరావు అనే వ్యక్తి రవాణాకు సిద్ధంగా ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ స్టాకును ఎమ్ఎల్‌సీ పాయింట్‌కి తరలించి నిందితునిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

79వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

అగనంపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శివాని నగర్, ఆర్కే టౌన్‌షిప్ ప్రాంతాల్లో ఆదివారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో మురుగు నీరు రహదారులపై నిలిచిపోతుందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ఆయనకు వివరించారు. వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతానని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగుల పిల్లల క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్ పోస్టరును ఆదివారం తుంగ్లాంలో 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పిల్లల మధ్య నిర్వహించే ఇటువంటి పోటీల వల్ల వారి మధ్య స్నేహబంధం మరింత బలపడుతుందన్నారు. ఈ పోటీలు జనవరి పది నుంచి మూడు రోజుల పాటు బెల్ క్రీడా మైదానంలో జరగనున్నాయి. కార్యక్రమంలో కొరియాగ్రాఫర్ పి.రమేశ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు జె.రాము, కార్యదర్శి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్ సౌజన్యంతో సేఫ్ లాకర్ ప్రారంభం




సేఫ్‌లాకర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర హోమ్‌శాఖా మంత్రి అనిత

మల్కాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రికార్డులు భద్రపరిచే సేఫ్ లాకర్‌ను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఈ సేఫ్ లాకర్‌ను రూ. 12 లక్షలతో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, కోరమాండల్ ఎరువు కర్మాగారం వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ జ్ఞానసుందరం, డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ కాకి శ్రీకాంత్, ముఖ్యభద్రతా అధికారి నారాయణ పాత్రుడు, డిప్యూటీ మేనేజర్ (సీఎస్ఆర్) శేషపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి రథసారథులు

» సభ్యత్వ నమోదులో విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండి బాబ్జీ, నాయకులు

గోపాలపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే రథసారథులని ఆ పార్టీ విశాఖ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. గ్రేటర్ పరిధి 88వ వార్డు నరవ గ్రామంలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్య క్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గండి బాబ్జీ మాట్లాడుతూ. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి వేపగుంట, బీసీకాలనీ పరిసర ప్రాంతాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ముత్యమాంబ కాలనీలో ఉన్న సమృద్ధి గృహ ప్రార్థనా మందిరం పరిసర ప్రాంతాల్లో సుమారు 150 మంది సభ్యత్వ నమోదు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి కిరణ్, ఆనంద్, వేణు, సుందరావు, డేనిస్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: తెలుగుదేశం పార్టీ సభ్యత్వమంటే ఓ గౌరవమని 78వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కొల్లి శివనాగేశ్వరరావు అన్నారు. స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావును గెలిపించుకున్నామని, అదే స్ఫూర్తితో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వం చేయాలన్న లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామన్నారు. టీడీపీ సభ్యత్వంతో గౌరవంతో పాటు బీమా సదుపాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నతానీయల్, జి.నరేంద్ర, రమేష్, ఈశ్వరరావు, కృష్ణయ్య, మునలయ్య పాల్గొన్నారు.